క్లుప్తంగా

లబ్ధిదారుల ఇంటి వద్దకే పథకాల లబ్ధి



వట్లూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఆళ్ల సతీష్‌చౌదరి తదితరులు

పెదపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిస్తున్నారని జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులో బుధవారం నిర్వహించిన పల్లె పిలుస్తోంది, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, గుజ్జుల నవీన్, పంచాయతీ కార్యదర్శి మేకా శ్రీనివాస్, వీఆర్వోలు రాంబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో జేసీ పర్యటన

దెందులూరు: తుపాను కారణంగా తడిచిన ధాన్యాన్ని మానవతా దృక్పథంతో నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని, రైతులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి అన్నారు. బుధవారం మండలంలోని పోతునూరు, ఇతర గ్రామాల్లో రైస్‌మిల్లులకు వెళ్లి తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్యను ధాన్యం కొనుగోళ్లు, మండలంలో తుపాను వల్ల నష్టం, రైతుల ఇబ్బందులను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన సమన్వయంతో అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొని పూర్తి చేయాలని సూచించారు.

ఏఎంసీ చైర్మన్ పరిశీలన

పెదపాడు: నీట మునిగిన పంటలు రైతులకు నష్టం జరగకుండా చూడాలని దెందులూరు ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్ అధికారులను కోరారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు, వసంతవాడ, తోటగూడెం, పాత ముప్పర్రు, కొత్తముప్పర్రు గ్రామాల్లో ఆయన పర్యటించారు. నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, నాయకులు మెడబలిమి సంతోష్‌కుమార్, కోట గోవర్ధన్, ఎంపీటీసీ కర్రె అనీల్‌కుమార్, బత్తుల ఏసురాజు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలి



మేధినరావుపాలెం వద్ద కోతకు గురైన పోలవరం కుడి కాలువ

దెందులూరు: తుపాను కారణంగా మేధినరావు పాలెంలో భారీ వరద వల్ల కోతకు గురైన పోలవరం కుడి కాలువ వద్ద రోడ్డు మరమ్మతు పనులను 44 గంటల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, సర్పంచ్ దుర్గాకుమారి రాజు రోడ్డును పరిశీలించారు.

సైనికుల్లా పనిచేస్తున్న వలంటీర్లు



కూచింపూడిలో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న కొఠారు, ప్రజాప్రతినిధులు

పెదవేగి : తుపాను విపత్కర సమయంలో ఇంటింటికీ తిరుగుతూ సైనికుల్లా వలంటీర్లు పని చేస్తున్నారని ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. రెండు రోజుల నుంచి తుపాను కారణంగా విస్తారంగా కురిసిన వర్షాలకు కూచింపూడి, ముండూరులో ముంపు బారిన పడ్డ పంట పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన బాధితులను పరామర్శించి వారికి ఆర్థిక సహాయాన్ని, బియ్యాన్ని అందించారు. సందర్భంగా కొఠారు మాట్లాడుతూ తుపాను బాధితులు తమ కష్టాన్ని ఎమ్మెల్యే కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కి లేదా వ్యక్తిగతంగా వచ్చి సమాచారం అందిస్తే ఆదుకుంటామని చెప్పారు. రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, తహసీల్దార్ ఎన్ నాగరాజు, ఏఓ ప్రియాంక, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, సర్పంచ్‌లు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనే నిజమైన నివాళి

గణపవరం: బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని పలువురు అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో జ్యోతిర్మయి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, మండల సిబ్బంది పూలమాలలు వేసినివాళులర్పించారు.

తుపాను తీవ్రత.. పంటలపై ప్రభావం

- 30 విద్యుత్ స్తంభాలు, 12 ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం
- పోర్లీడ్యామ్ ఉధృతికి నల్లమాడు రహదారికి గండి
- రైతులను పరామర్శించిన ఎమ్మెల్యే వాసుబాబు



నిడమర్రు: కైకరంలో రైతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు (నిడమర్రు): బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ తీరం దాటుతూ ఉంగుటూరు మండలంపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. దీంతో ఉంగుటూరు మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 274మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం రాత్రి వీచిన బలమైన గాలులకు ఉంగుటూరు, కైకరం గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, భారీ వృక్షాలు నేలకు ఒరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ఆయా గ్రామాలు చీకట్లో మగ్గాయి. బుధవారం ఉదయం వరకూ కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కైకరం, ఉంగుటూరు, రామన్నగుడెం, వెంకటకృష్ణాపురం, బ్రహ్మానందపురం, తల్లాపురం, గొల్లగుడెం, చేబ్రోలు, తిమ్మయ్యపాలెం, ఏగోపవరం తదితర గ్రామాలు లోతట్టు ప్రాంతాలు నీటిలో నానుతున్నాయి. గొల్లగుడెం, కైకరంలోని 4 ఇళ్లు కూలిపోయి ఇంటి సామాన్లు వర్షం నీటిలో కొట్టుకుపోయాయి. నల్లమాడు నుంచి ఎర్రమిల్లిపాడు వెళ్లే రహదారి నల్లమాడు చెరువు నీటితో పొర్లి డ్యామ్ వాగు ఉద్రితికి రహదారి కొట్టుకుపోయింది. దీంతో ఎర్రమిల్లిపాడు వెళ్లేందుకు మార్గం స్తంభించి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.



పెదపాడు: తోటగూడెంలో నీటి మునిగిన పంటను చూపిస్తున్న రైతు

ఉంగుటూరులో సుడిగాలి విజృంభణ

ఉంగుటూరులో సింగరాజుపాలెం వెళ్లే మార్గంలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా ఏర్పడిన సుడిగాలి విజృంభణతో ఆ మార్గంలోని 31 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి, విద్యుత్ తీగలు ఎక్కడిక్కడ తెగిపడ్డాయి. 12 ట్రాన్స్‌ఫార్మర్లు శిథిలమయ్యాయి. దీంతో ఉంగుటూరు మంగళవారం రాత్రి పూర్తిగా అంధకారంలో ప్రజలు అల్లాడిపోయారు. విద్యుత్ ఏఈ శ్రీరామ్ తమ సిబ్బందితో



నాయుడుగూడెంలో వర్షం నీటిలో వరి కుప్పలు

విద్యుత్ పునరుద్ధరణ పనుల చేపట్టారు.

నల్లమాడు వద్ద గండిని పరిశీలించిన ఎమ్మెల్యే

నల్లమాడు నుంచి ఎర్రమిల్లిపాడు వెళ్లే రహదారి ముంపునీటికి కొట్టుకుపోయిన గండిని బుధవారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పరిశీలించారు. ఆ మార్గంలో తక్షణం సిమెంట్ తూర్లు అమర్చి రహదారిని పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. అదే స్థానంలో కల్వర్టు నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని అధికారులను సూచించారు. మండల కన్వీనర్ మరడాని మంగారావు, సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావు, నెక్కంటి దుర్గాప్రసాద్, గణపతినీడు మధు, తహసీల్దారు రమణా రావు తదితరులున్నారు.

బాధిత రైతులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే

ఉంగుటూరు (నిడమర్రు): కైకరం, తల్లాపురం, గొల్లగుడెం, చేబ్రోలు, ఎర్రమిల్లిపాడులోని వరి చేలు ముంపునకు గురై నష్టపోయి న రైతులను బుధవారం ఎమ్మెల్యే వాసుబాబు పరామర్శించి నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రైతులకు ధైర్యం చెప్పారు. తుఫాన్ ప్రభావంతో 700 ఎకరాలపైనే పంట నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, వెజ్జు వెంకటేశ్వరరావు, పుప్పాల గోపి, జెడ్పీటీసీ జయలక్ష్మి, ఎంపీపీ శ్రీలక్ష్మి, ఆర్డీవో ఖాజావల్లీ, జేడీ రామకృష్ణ, ఎంపీటీసీ వి. అప్పన్న, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి తదితరులున్నారు.

తుపాను ప్రభావంతో రైతులు అతలాకుతలం

పెదపాడు: ఈఏడాది ఖరీఫ్ సాగుపై ఒక్కసారిగా మిచాంగ్ తుపానుతో విరుచుకుపడింది. తుపాను కారణంగా కురిసిన అధిక వర్షాలకు పెదపాడు-వట్లూరు రహదారి, కొనికి- ఎస్‌కొత్తపల్లి రహదారుల పై ఉన్న కాజ్‌వేలపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. రైతులు పొలంలో నిండిన నీటిని బయటకు పంపే మార్గాలు కోసం అన్వేషిస్తున్నారు. వరికుప్పలు జల దిగ్బంధనంలో ఉన్నాయి. రైతులు ధాన్యం రాసులు తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు పర్యటించి పంట రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.



నిడమర్రు: ఎర్రమిల్లిపాడు- నల్లమాడు మార్గంలో కొట్టుకుపోయిన రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



భీమడోలు: నరెడ్లగూడెంలో వర్షం నీటిలో ధాన్యం రాశులు



పెదపాడు: సత్యవోలులో నీట మునిగిన వరి పనలు

చురుగ్గా ధాన్యం తరలింపు



నరెడ్లగూడెం, వడ్లపట్ల మధ్య నీటిలో ఉన్న ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న ఏవో ఎస్‌పీవీ ఉషారాణి

భీమడోలు: వరుణుడు కరుణించడంతో రైతుల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించే చర్యలకు అధికారులు ఉపక్రమించారు. బుధవారం గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పర్యటించారు. ఏ గ్రామాల్లో మిల్లులకు తరలించేందుకు అనువుగా ఉన్న ధాన్యాన్ని గుర్తించిన అధికారులు యుద్ధప్రాతిపదికన వాహనాల్లో పంపించారు. భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి పర్యవేక్షించారు. రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో తేమశాతం సంబంధం లేకుండా మిల్లులకు ధాన్యాన్ని ట్రాక్టర్లు, లారీల్లో తరలిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 350 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని తరలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో తరలింపును మరింత వేగవంతం చేస్తామని వారు పేర్కొన్నారు. రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు మండలంలోని 500 ఎకరాల్లోని వరి పంట తడిసిందని, భీమడోలు, పూళ్ల, దుద్దేపూడి, అంబర్‌పేట, కోడూరుపాడులో 2వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పూర్తిగా తడిసినట్లు ఏవో తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్‌లు పంపిణీ



కార్మికులకు రెయిన్ కోట్‌లు అందిస్తున్న గ్రూపు సభ్యులు

ఉంగుటూరు(నిడమర్రు): వెల్ఫేర్ ఆఫ్ చేబ్రోలు వాట్సాప్ గ్రూపు చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని చేబ్రోలు సర్పంచి రాందేలక్ష్మీ సునీత రాజారావు అన్నారు. బుధవారం చేబ్రోలు గ్రామ పంచాయతీ వద్ద వెల్ఫేర్ ఆఫ్ చేబ్రోలు సభ్యులు పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

తుపాను ప్రాంతాల్లో సహాయక చర్యలు



దెందులూరు: శింగవరంలో తుపాను బాధితులకు ఆహారం అందజేస్తున్న సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత, నాయకులు



భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు జంక్షన్‌లో ముంపు నీరు ప్రవహిస్తున్న దృశ్యం

దెందులూరు: తుపాను బాధితులకు వైఎస్సార్ సీపీ శ్రేణులు అండగా ఉండాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని ప్రజాప్రతినిధులు స్పందించారు. సింగవరం గ్రామస్తులకు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్ ఆహారాన్ని అందించారు. మేధినరావుపాలెంలో జేసీబీతో పోలవరం కాల్వ గట్టును పటిష్ట పరిచే పనులను సర్పంచ్ దుర్గాకుమారి రాజు, కామిరెడ్డి నాని, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య ప్రారంభించారు. దెందులూరు గుండేరు వాగు వద్ద హైవే పక్కన అడ్డుకట్టను జేసీబీతో సొసైటీ చైర్మన్ కొలుసు గణపతి రావు ఆధ్వర్యంలో తొలగించారు. పోతునూరులో వర్షానికి కూలిన ఇంటిని సర్పంచ్ బోదుల స్వరూప్ పరిశీలించారు. దెందులూరులో సైఫన్ అండర్ పాస్ వద్ద ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నాయకులు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

పొంగి పొర్లిన చెరువులు

భీమడోలు: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు భీమడోలులోని ఆర్జావారిగూడెంలోని చెరువు, వడ్లపట్లలోని చెరువులు ఎగువ నుంచి వచ్చే నీటితో పొంగి పొర్లడంతో పలు ప్రాంతాలు జలమయ్యాయి. ప్రధాన రహదారుల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముంపు నీరు కాలనీల్లోని గృహాల్లోకి చేరింది. జాతీయ రహదారి భీమడోలు జంక్షన్‌లో ముంపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెంలోని పలు వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో ముంపు నీరంతా భీమడోలు జంక్షన్‌కు చేరింది. ఆర్జావారిగూడెంలోని చెరువు నిండి పొంగి ప్రవహించడంతో గ్రామంలోని వీధులు జలదిగ్బంధనంలో ఉన్నాయి. బుధవారం ఉదయం నుంచి వర్షం తగ్గుముఖం పట్టడంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

దెబ్బతిన్న ఆరు ఇళ్లు

మండలంలోని వర్షానికి ఆరు ఇళ్లు దెబ్బతిన్నాయి. భీమడోలులో 4, గుండుగొలను, అంబర్‌పేటలో ఒకొక్క ఇల్లు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. భీమడోలులోని నెహ్రూ, ఇందిరాకాలనీ, నరెడ్లగూడెం, బీసీ కాలనీలు, ఆర్జావారిగూడెంలోని ముంపు నీటితో జలమయ్యాయి. ముంపు నీటిని బయటకు తరలించేందుకు సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో సహాయక చర్యలు చేపట్టారు.భీమడోలు బాలుర వసతి గృహంలోకి నీరు చేరి విద్యార్థులు ఇబ్బందుల పడ్డారు. నరెడ్లగూడెంలో పల్లపు ప్రాంతంలోని ధాన్యం రాసులు తడిసి ముద్దయ్యాయి. తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అక్కడ పరిస్థితులను పరిశీలించారు.

దోమల మందు తాగి వృద్ధుడి ఆత్మాహత్యాయత్నం

భీమడోలు: వర్షానికి ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో మస్తాపానికి గురైన కౌలు రైతు తండ్రి మాగంటి వెంకటస్వామి దోమల మందు తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం నరెడ్లగూడెం ఏరియాలో చోటు చేసుకుంది. వృద్ధుడు వెంకటస్వామిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంబర్‌పేట పంచాయతీ శివారు వడ్లపట్లకు చెందిన కౌలు రైతు మాగంటి శ్రీనువాసరావు భీమడోలు పార్వతీ సమేత భీమేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో నరెడ్లగూడెం ఖాళీ స్థలాల్లో 640 ధాన్యం బస్తాలను ఆరబోసాడు. వాటిలో 41 బస్తాల మినహా మిగిలిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాడు. అధికారులు వాటిని తరలించేందుకు ఏర్పాట్లు చేసారు. తేమశాతం తగ్గేందుకు రెండురోజులు సమయం తీసుకుంటానని కౌలు రైతు సంబంధిత వ్యవసాయ అధికారులకు చెప్పాడు. ఇంతలో ఆకాల వర్షం వల్ల ఆ బస్తాల ధాన్యం తడిసిపోయింది. ధాన్యం తడిసిపోవడంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు తండ్రి వెంకటస్వామి దోమల మందును తాగి ఆత్మాహత్యాయానికి పాల్పడ్డాడు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అనంతరం వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులు అక్కడఉన్న ధాన్యాన్ని మిల్లులకు లారీలో తరలిస్తున్నామని ఏవో ఎస్‌పీవీ ఉషారాణి తెలిపారు.

గంగాదేవికుంట చెరువుకు గండి



తుపాను ప్రభావంతో గంగాదేవికుంట చెరువుకు గండి పడిన దృశ్యం

పెదవేగి : పెదవేగి మండలం రామసింగవరంలో గంగాదేవికుంట చెరువుకు గండిపడింది. తుపాను ప్రభా వంతో రెండురోజులుగా కురిసిన వర్షాలకు ఈ చెరు వుకు భారీగా వరదనీరు చేరింది. చెరువుకు గండి పడి నీరంతా గుండెరులో కలుస్తోందని గ్రామప్రజలు ఆవేదన చెందుతున్నారు. 28ఎకరాల విస్తీర్ణంలోని గంగా దేవి చెరువు కింద సుమారు 300 ఎకరాల ఆయకట్టు సాగుభూమి ఉందని రైతులు తెలుపుతున్నారు. ఇరిగేషన్ పరిధిలోఉన్న ఈ చెరువును అధికారులు పరిశీలించి చెరువుకు పడ్డ గండిని పూడ్చి చెరువును మరింత అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, కొఠారు రామచంద్రరావు

దెందులూరు: తుపాను వల్ల నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని, ప్రతి గింజను తప్పనిసరిగా కొనుగోలు చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని కొవ్వలి, ఉండ్రాజవరం, సత్యనారాయణపురం, పోతునూరులో ముంపునకు గురైన వరి పొలాలను, తడిసిన ధాన్యం రాసులను వారు పరిశీలించి రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సర్పంచులు ఇంటేటి మధులత, బోదుల స్వరూప్, సొసైటీ మాజీ చైర్మన్ డీఎన్‌వీడీ ప్రసాద్ (బజ్జి), తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఏఓ గద్దె రమేష్, ఎంపీడీఓ భీమరాజు పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ముంపు బారిన పడిన పంట పొలాల పరిశీలనకు స్కూటర్‌పై పరిశీలనకు వెళ్లారు. అధికార వాహనం వదిలిపెట్టి స్కూటర్‌ను స్వయంగా నడుపుకుంటూ వెళ్లి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

నిడమర్రులో..

నిడమర్రు: వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడొద్దని తాహసీల్దారు బి.సాయిరాజు తెలిపారు. ఆయన బుధవారం పెదనింద్రకొలను, తోకలపల్లి, అడవికొలను, బువ్వనపల్లి, ఎనికేపల్లిలో పర్యటించి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. వర్షాలకు తడిసిన ధాన్యం రాశులను పరిశీలించారు. వర్షం తెరిపిచ్చిన తర్వాత రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో గీత, ఏఈవో ప్రసాద్ తదితరులున్నారు.



మొయ్యేరులో నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి



ముంపు బారిన పడిన పొలాల పరిశీలనకు స్కూటర్‌పై వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ధాన్యం ఒబ్బిడిలో రైతుల నిమగ్నం

గణపవరం: తుపాను చేసిన గాయాల నుంచి తేరుకోవడానికి రైతులు సమాయుత్తమవుతున్నారు. సోమ, మంగళవారాలలో ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు సార్వా పంట నీటమునిగింది. రైతులు తడిసిన ధానాన్ని ఒబ్బిడి చేసుకునే పనులు ప్రారంభించారు. గణపవరం మండలంలో దాదాపు 15వేల ఎకరాల్లో సార్వా సాగు చేయగా 5 వేల ఎకరాల్లో రైతులు మాసూళ్లు పూర్తిచేసి కొందరు ధాన్యాన్ని మిల్లులకు తరలించగా, మరికొందరు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకున్నారు. బుధవారం వాతావరణం తెరిపి ఇచ్చి, కాస్త ఎండ కాయడంతో రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు సూచనలు ఇస్తున్నారు. కొండేపాడులో విద్యుత్ తీగలపై కొబ్బరిచెట్టు పడిపోయి సరఫరా నిలిచిపోయింది.గణపవరం మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న సార్వా పంట నేలపై పడిపోయిందని మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. బుధవారం కొండేపాడు, మొయ్యేరు, ముప్పర్తిపాడు, అర్ధవరంలో ఆయన పర్యటించారు.